BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 30 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## పీజీ వైద్య విద్యలో రాష్ట్ర రిజర్వేషన్ లు రద్దు

- సుప్రీం కోర్టు సంచలన తీర్పు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

వైద్యవిద్యలో నివాస ఆధారిత కోటాను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కోటా కింద పీజీ సీట్ల కేటాయింపులో అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. "మనకు దేశంలో ఎక్కడైనా నివసించే హక్కు ఉంది. దేశంలోని ఏ విద్యాసంస్థలోనైనా చదువుకునే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. మనమంతా భారత్ భూభాగంలో నివసిస్తున్నాం కాబట్టి ఏ ప్రావిన్స్, ఏ రాష్ట్ర నివాసం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఉద్యోగం, వ్యాపారం చేసుకోవడానికి దేశంలో ఎక్కడైనా ఉండే హక్కు ఉంది. అలాగే చదువుకునే హక్కు కూడా" అని ధర్మాసనం వెల్లడించింది. నిర్దిష్ట రాష్ట్రంలో నివసించేవారి విషయంలో రిజర్వేషన్ల గురించి ఆలోచించవచ్చని, అయితే అది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల వరకే అని వ్యాఖ్యానించింది. ఆ తర్వాత ఉన్నతవిద్యా కోర్సుల విషయంలో నివాస ప్రాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే.. ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లే అవుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే జారీ అయిన నివాస ఆధారిత రిజర్వేషన్లకు ఈ తీర్పు వర్తించదని పేర్కొంది.

మిగిలినా 2వ పేజీలో

# మహా కుంభమేళాలో తొక్కిసలాట

## 30 మంది మృతి..

### 90 మందికిపైగా గాయాలు

మౌనీ అమావాస్య సందర్భంగా

కోట్లాదిగా భక్తుల రాక

ప్రభుత్వ వైఫల్యంపై ప్రతిపక్షాల ఆగ్రహం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మహా కుంభమేళాలో విషాదం చోటుచేసుకుంది. మౌని అమా వాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు సంగమం వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దాంతో భక్తుల తాకిడికి బారికేడ్లు విరగడం వల్ల తొక్కిస లాట జరిగింది. ఈ ఘటనలో 30 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. మరో 100 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. వెంటనే స్పందించిన సిబ్బంది. క్షతగాత్రుల ను అంబులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు. తొక్కి సలాట ఘటన నేపథ్యంలో అమృతస్నానం కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్లు అఖాడాలు ప్రకటించారు.

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాడు ప్రధాని మోడీ ఫోన్ చేశారు గంటలో మూడు సార్లు సీఎంతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా. ఘటనపై ఆరా తీశారు. మరోవైపు, సీఎం యోగి భక్తులకు విజ్ఞప్తి చేశారు. త్రివేణి సంగమం ప్రధాన కేంద్రం వద్దకు రాకుండా సమీపంలోని మాట్ల వద్ద పుణ్యస్నానాలు ఆచ రించండి. ఆదేశాలు, సూచనలను పాటిసూ అధికారులకు సహకరించండి. ఎలాంటి వదంతులను 'నమ్మొద్దు' అని యూపీ సీఎంఓ ప్రకటన విడుదల చేసింది.

### రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి.

ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుం బాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుణ్ని ప్రార్థిస్తున్నలు పేర్కొన్నారు. బాధితులకు సహాయ సహకారాలను అం దించేందుకు యూపీ ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మోదీ తెలిపారు. ఈ ఘటనపై సీఎం యోగితో మాట్లాడి వివరాల న్నీ తెలుసుకున్నట్లు చెప్పారు. బాధిత భక్తుల కు సహాయం అందించే విషయంలో యూప్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్న మని అన్నారు.

### న్యాయ విచారణకు ఆదేశం

మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వైరీ అరిపించను న్నట్లు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ ఘటన ప్రభుత్వయంత్రాంగా నికి ఓ పాఠంలాంటిందన్నారు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై నివేదిక సమర్పించా అని కుంభ మేళా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

### చెత్త డబ్బాలతోనే ప్రమాదం..!

మౌని అమావాస్య రావడంనల బుధవారం తెల్లవారుజామున 2గంటలసమయంలోపులు స్నానాలు చేసేందుకు భక్తులు పద్దసంఖ్యలో నివేణి సంగమానికి చేరుకున్నారు. తలపై పె ద్దపెద్ద లగేజీలతో భక్తులు వచ్చారు. అయితే పుణ్యస్నానాలు చేయడానికి ఎటువైపు వెళాల నేదానిపై చాలామందికి స్పష్టత లేదు భక్తుల సౌకర్యార్థం త్రివేణీసంగమం పరిసరాల్లో పెద్ద సంఖ్యలో ఇనువ చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. చీకట్లో అవిభక్తులకు కనిపించలేదు. దీంతో ఆ చెత్తడన్నాలు తగిలి చాలా మంది కిందపడ్డారు. దీంతో తొక్కిసలాట జరిగింది. అని పలువురు ప్రత్యక్ష సాక్షులు చెప్పాడు

రామ్సింగ్ అనే ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ తొక్కిసలాట జరిగిన ప్రాంతంలో జనం నిండి పోయారు దీంతో ఎటు వెళ్లాలో ఎవరికీ అర్థం కాలేదు. ఈ క్రమంలోకొందరు నాకళ్ల ముందే సృహతప్పి కిందపడ్డారు చెత్త డబ్బాలుతగిలి ఇంకొందరు కింద పడ్డారు.' అని చెప్పాడు. రాగా కుంభమేళాకు భక్తులు పోటెత్తడంతో అటుగా వెళ్లే జాతీయ రహదారిపై భార్ రద్దీ నెలకొంది. దాదాపు 20 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.




### బారీకేడ్లను తొలగించడంవల్లే తొక్కిసలాట

- మహాకుంభ్ డీఐజీ వైభవ కృష్ణ

**బలగం టీవి, న్యూఢిల్లీ**

మహా కుంభమేళా తొక్కిసలాటలో మొత్తం 30 మంది మరణించారని ఉత్తరప్రదేశ్ పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన వివరాలను మహా కుంభమేళా డీఐజీ వైభవ్ కృష్ణ మీడియాకు వెల్లడించారు. తొక్కిసలాటలో మొత్తం మరణాల సంఖ్య 30కి పెరిగిందని, మరో 36 మంది గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. మృతుల్లో 25 మందిని గుర్తించామని, మరో ఐదుగురు ఏ ప్రాంతానికి చెందినవారో గుర్తించాల్సి ఉందని డీఐజీ చెప్పారు. బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట రెండు గంటల మధ్య తొక్కిసలాట జరిగిందని ఆయన వెల్లడించారు. మౌని అమావాస్య నేపథ్యంలో భక్తులు ఊహించిన దానికింటే అధిక సంఖ్యలో పుణ్య స్నానాలకు తరలివచ్చారని, రద్దీ పెరగడంతో పలుచోట్ల బారీకేడ్లను తొలగించారని, అదే తొక్కిసలాటకు దారితీసిందని వైభవ్ కృష్ణ తెలిపారు.

## కులగణనపై ముసాయిదా సిద్ధం



- ఫిబ్రవరి 2న క్యాబినెట్ సబ్ కమిటీకి అందజేత
- కులగణనపై జాతీయ స్థాయిలో ప్రశంసలు
- దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ
- అధికారులు, ఉద్యోగులకు అభినందనలు
- సీఎం రేవంత్ రెడ్డి
- కులగణనపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో విజయవంతంగా పూర్తి చేసిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) కు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కుల గణనపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహ గారు, ధనసరి సీతక్క గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు గారు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి , వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన ఇంటింటి సర్వే దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అభినందించారు. సర్వేకు సంబంధించి డేటా ఎంట్రీ పూర్తయిందని, ముసాయిదా సిద్ధమైందని అధికారులు వివరించారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఫిబ్రవరి 2 వ తేదీలోగా నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటేడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కుల గణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు.

రాష్ట్రంలో గత ఏడాది నవంబర్ 6 వ తేదీన ఈ సర్వే ప్రారంభం కాగా, అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారం నాటికి సర్వే పూర్తయింది. ప్రణాళిక విభాగం అధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటింటి సర్వే మహా యజ్ఞంలో ఎన్యుమరేటర్లు, సూపర్? వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దాదాపు లక్ష మందికిపైగా ఉద్యోగులు పాలుపంచుకున్నారు. రాష్ట్రంలోని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించగా, ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. దాదాపు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు విజయవంతంగా సేకరించాయి. వీటికి సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి చేశాయి.

కొన్ని చోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటం, కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవటం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాలుపంచుకోలేదని అధికారులు సమావేశంలో వివరించారు. అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది.

## ఫిబ్రవరి 10లోగా అత్యుత్తమ పర్యాటక విధానం



- దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా రూపొందించండి
- సింగపూర్ తరహా ఎకో టూరిజం విధానాలను పరిశీలించాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫిబ్రవరి 10 వ తేదీలోగా అత్యుత్తమ పర్యాటక విధానం సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల్లోని అత్యుత్తమ పాలసీని అధ్యయనం చేసి తెలంగాణ పర్యాటక పాలసీని రూపొందించాలని చెప్పారు. ముఖ్యమంత్రి టూరిజం పాలసీపైన మంత్రి జూపల్లి కృష్ణారావు , టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారు సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.

దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా పాలసీ ఉండాలి. ప్రధానంగా టెంపుల్, ఎకో టూరిజంపై దృష్టి సారించాలి. రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ఆస్కారం ఉన్న, అవసరమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలి. సింగపూర్ తరహా ఎకో టూరిజం విధానాలను పరిశీలించాలి. సమ్మక్క-సారలమ్మ జాతర జరిగే సమయంలో భక్తులు, పర్యాటకులను ఆకర్షించేందుకు రెవెన్యూ, అటవీ, పర్యాటక శాఖలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. జాతరతో పాటు సమీప పర్యాటక ప్రాంతాలు, ఆలయాలను కలుపుతూ ఒక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలి. ఆదిలాబాద్, వరంగల్, నాగార్జునసాగర్ లాంటి ప్రాంతాలలో ఎకో టూరిజంను మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉండాలి. వచ్చే గోదావరి, కృష్ణా పుష్కరాలకు దేశవ్యాప్తంగా భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. హైదరాబాద్ నగరంలో హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, ఇందిరా పార్క్‌లను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించాలి. పర్యాటక అభివృద్ధితో రాష్ట్రానికి మరింత గుర్తింపు, ఆదాయం వచ్చేలా ఈ పాలసీని రూపొందించాలి.

## ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు,ఆంధ్రప్రదేశ్‌లోనూ మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ కుర రఘునాథం రెడ్డి, వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అలాగే ఉత్తరాంధ్ర (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

షెడ్యూల్

| | |
|---|---|
| 1. నోటిఫికేషన్ | ఫిబ్రవరి 3 (సోమవారం) |
| 2. నామినేషన్ దాఖలకు గడువు | ఫిబ్రవరి 10 (సోమవారం) |
| 3. నామినేషన్ల పరిశీలన | ఫిబ్రవరి 11 (మంగళవారం) |
| 4. నామినేషన్ల ఉపసంహరణకు గడువు | ఫిబ్రవరి 13 (గురువారం) |
| 5. పోలింగ్ | ఫిబ్రవరి 27 (గురువారం) (ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు) |
| 6. ఓట్ల లెక్కింపు | మార్చి 3 (సోమవారం) |

## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట బోర్డు



- ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలని
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- యాదగిరిగుట్ట బోర్డు నియామకపు నిబంధనలపై సీఎం సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరహాలో బోర్డు ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను సూచించారు. యాదగిరిగుట్ట బోర్డు నియామకపు నిబంధనలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. తిరుమలలో మాదిరే యాదగిరిగుట్ట ఆలయం సమీపంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలని, ఆలయ పవిత్రత కు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ధర్మకర్తల మండలి నియామకంతో పాటు ఆలయం తరఫున చేపట్టాల్సిన పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై ముసాయిదాలో పేర్కొన్న నిబంధనలకు సీఎం గారు పలు మార్పులు సూచించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ గారు, ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు గారు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్ గారు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు గారు తదితరులు పాల్గొన్నారు.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టులు మృతి

**బలగం టీవి, రాంచీ**

జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. మ ృతుల్లో ఓ మహిళ కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సోనువా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఓ మహిళ సహా ఇద్దరు మావోయిస్టులు మరణించారు. ఘటనా స్థలం నుంచి రెండు ఐఎన్ఎస్ఎఎస్ రైఫిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు కొల్హాన్ రేంజ్ డీఐజీ మనోజ్ రతన్ ఛోటే తెలిపారు. ఈప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అన్నారు.


## సూర్యాపేట బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్

- విద్యార్థినులు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ కలకలం రేపింది. ఆహారం వికటించడంతో ఈ వసతి గృహంలో ఉంటున్న పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన బాలికలకు సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న బాలికలను ఆర్డీవో, వైద్యాధికారి పరామర్శించారు. బాలికల ఆరోగ్యం నిలకడగా ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ తెలిపారు.

మిగిలినా 2వ పేజీలో



## ఇస్రో వందో ప్రయోగం విజయవంతం..

- నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్15

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో బుధవారం ఓ సరికొత్త మైలురాయిని చేరుకుంది. రెండోతరం నావిగేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇస్రోకు ఇది వందో ప్రయోగం. శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ఈ తెల్లవారు జామున 6.23 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్-ఎఫ్ 15 (జీఎస్ఎల్వీ-ఎఫ్ 15).. తాను మోసుకెళ్లిన ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని సరిగ్గా 19 నిమిషాల తర్వాత 322.93 కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది.

ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ఇస్రో ఇప్పటి వరకు 100 ప్రయోగాల్లో ఆరు జనరేషన్లకు చెందిన 548 శాటిలైట్లను ప్రయోగించినట్టు తెలిపారు. వీటి మొత్తం బరువు

మిగిలినా 2వ పేజీలో

## శ్రామికవర్గ ప్రయోజనాలకు పోరాడేది కమ్యూనిస్టులు



- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. అధికారంలో ఎవరున్నా, ఏ పార్టీ ఉన్నా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలంటూ ప్రశ్నిస్తామని చెప్పారు. శ్రామికుల దోపిడీ, సామాజిక అణచివేత, సరళీకృత ఆర్థిక విధానాలపై బలమైన ఉద్యమాలను నిర్మిస్తామని వివరించారు. బీజేపీ మతోన్మాదాన్ని ఎండగడతామనీ, నిలువరిస్తామని అన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు విజయవంతంగా ముగిశాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీని, 15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని, 60 మందితో రాష్ట్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు

మిగిలినా 2వ పేజీలో

# నేను మాట్లాడితే బీఆర్ఎస్ ఇబ్బంది పడాల్సి వస్తుంది

**● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్లగొండ బీఆర్ఎస్ రైతు ధర్నాలో చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. పదేళ్లుగా నల్లగొండను పట్టించుకోకుండా.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వచ్చారంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారాయన. బుధవారం(జనవరి29) కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు.

కేటీఆర్ పనికిరానోడు.. పనికి రాని మాటలు మాట్లాడుతున్నాడు. నల్లగొండలో కేటీఆర్ మీటింగ్‌కు మా మీటింగ్ కు వచ్చే పల్లీలు,ఐస్ క్రీం లు అమ్ముకునే వారు వచ్చేంత మంది కూడా రాలేదు. నల్లగొండలో టీ హబ్‌కు తాళం వేసిందే కేటీఆర్. ఎస్ఎల్‌బీసీ ఎందుకు పూర్తి చేయలేకపోయారు? కంపెనీలు ఎందుకు తేలేకపోయారు. హరీష్‌రావు, కేటీఆర్ మీరు నా కాలి గోటికి కూడా సరిపోరు. కేటీఆర్ నీలాగా నాపై అవినీతి ఆరోపణలు లేవు. లక్షల కోట్లు సంపాదించుకోలేదు. కేసీఆర్ లాగా నేను ఎలక్షన్, కలెక్షన్ చేయలేదు. నేను మాట్లాడితే బీఆర్ఎస్ చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

పతిపక్ష నేత పదవి కోసం హరీష్ రావు, కేటీఆర్ కత్తులతో పొడుచుకుంటున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా భట్టి పాదయాత్ర చేసి..ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బడ్జెట్ సెషన్‌కు కేసీఆర్ వస్తడో రాడో చెప్పాలి.తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నరా? బండి సంజయ్ ఉన్నరా? గద్దర్‌కు అవార్డ్ ఇస్తే తప్పేంటి? కేంద్ర మంత్రి హొదాలో ఉన్న బండి సంజయ్ అలా మాట్లాడకుండా ఉండాల్సింది. .. కేసీఆర్ కంటే లాలూ ప్రసాద్ యాదవ్ ఎంతో నయం అని కోమటిరెడ్డి అన్నారు. లాలూ జైల్లో? ఉన్నప్పుడం.. బయట ఉన్న ఆయన కొడుకులు ఎంపీ సీట్లు గెలిపించారు. కానీ, కేటీఆర్ ఒక్క సీటు అయినా గెలిచారా? కేటీఆర్ ప్లేస్‌లో నేను ఉంటే.. ఈపాటికి బీఆర్ఎస్ దుకాణం క్లోజ్ చేసేవాడ్ని అని కోమటిరెడ్డి అన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహాత్మగాంధీ వర్ధంతి రోజునే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 420 రోజులు పూర్తి చేసుకుంటున్నా ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయలేదని గురువారం రాష్ట్రవ్యాప్తంగా బీ ఆర్ ఎస్ నేతలు గాంధీ విగ్రహాలకు నివాళులర్పించడంతో పాటు వినతి పత్రాలు సమర్పించి రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని తమ నిరసన తెలియచేస్తారని బిఆర్ఎస్ ప్రకటించింది. ఎన్నికల వాగ్దానాల ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపట్టే నిరసన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అన్ని స్థాయిల పార్టీ నాయకులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 30 నాటికి 420 రోజులైన సందర్భంగా ప్రజలకిచ్చిన 420 ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయిలో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని ఆయన తెలిపారు.

# ఏడుపాయలలకు భారీ పోటెత్తిన భక్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

%మాఘ అమావాస్య సందర్భంగా మెదక్ జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయలకు భక్తులు బుధవారం పోటెత్తారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామున పూజలకు శ్రీకారం చుట్టారు. ఏడుపాయలలో ఉత్తర వాహినిగా ప్రవహించే మంజీరా నదిలో పవిత్ర స్నానాలు చేస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈ మేరకు మాఘ అమావాస్య రోజు ఏడుపాయల్లో మంజీర నదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రదానంగా జంట నగరాలైన హైదరాబాద్‌తోపాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలివచ్చారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ వనదుర్గాభవాని అమ్మవారిని దర్శించుకుని వివిధ రూపాలలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు భక్తుల సౌకర్యార్థం ఆలయ ఇఒ చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు. భక్తులు నది స్నానాలు చేసేందుకు సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు నుంచి ఈనెల 25వ తేదీన 0.35 టిఎంసిల నీటిని విడుదల చేయగా ఆ నీరు చేరికతో ఏడుపాయలలోని ఘనపూర్ ఆనకట్ట పూర్తిగా నిండి నిండుకుండలా మారింది. భక్తులు పవిత్ర స్నానాలు చేసేందుకు వీలుగా ఘనపూర్ ఆనకట్ట దిగువన మంజీర నది పాయల పొడవునా ఆర్‌డబ్లుయస్ అధికారులు తొమ్మిదిచోట్ల షవర్ బాత్‌లను ఏర్పాటు చేశారు. భక్తులు సులభంగా అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వీలుగా క్యూలైన్స్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పి ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డిఎస్పి ప్రసన్నకుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసిన ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, బ్రహ్మచారి తదితరులు సేవలు అందించారు.

# పీజీ వైద్య విద్యలో రాష్ట్ర రిజర్వేషన్ లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

పీజీ మెడికల్ కోర్సులకు నివాస ఆధారిత రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని గతంలో పంజాబ్-హరియాణా కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని పలువురు సుప్రీంకోర్టు లో సవాల్ చేయగా.. ఇద్దరు సభ్యుల ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అయితే కేసు ప్రాముఖ్యత దృష్ట్యా దానిని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సిఫారసు చేసింది. ఈక్రమంలోనే తాజా తీర్పు వెలువడింది.

# సూర్యాపేట బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది విద్యార్థినులు వాంతులు చేసుకోవడంతో వారిని మొదట అర్బన్ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అనంతరం వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు వసతి గృహానికి చేరుకున్నారు.

# శ్రామికవర్గ ప్రయోజనాలకు పోరాడేది కమ్యూనిస్టులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణం తప్ప ఇతర హామీలేవీ అమలు కావడం లేదన్నారు. అది కూడా సరిపోయినన్ని బస్సుల్లేవని అన్నారు. విద్యవైద్యం వ్యాపారంగా మారిందనీ, సామాన్యులకు అందని ద్రాక్షగా ఉందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. దావోస్ పర్యటనలో పెట్టుబడులు వచ్చాయంటూ రేవంత్‌రెడ్డి ఊదరగొడుతున్నారనీ, గతంలో కేటీఆర్ కూడా అదే చేశారని అన్నారు. ఫోర్త్ సిటీ రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. ఆ పెట్టుబడులతో స్థాపించే పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై స్పష్టత లేదన్నారు. రాష్ట్రంలో అత్యధికమంది కార్మికులు, అసంఘటిత కార్మికు లున్నారని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 కూలి, ఏడాదికి 150 పని దినాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పట్టణ ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో సంపద సృష్టించే కార్మికులు, రైతులు, కూలీలు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు, రియల్ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, భూస్వాములకు ఉపయోగపడే విధానాలనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్నదని విమర్శించారు. శ్రామికవర్గ ప్రయోజనాల కోసం పోరాడేది కమ్యూనిస్టులు, సీపీఐ(ఎం) అని అన్నారు. ఈ వర్గాల పట్ల ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను బట్టి తమ వైఖరి ఆధారపడి ఉంటుందన్నారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తే, ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే ఏ ప్రభుత్వాన్నైనా ప్రతిఘటి స్తామని చెప్పారు.

ఇంటి స్థలం లేకుండా సొంతిళ్లు లేకుండా లక్షలాది మంది పేదలు రాష్ట్రంలో ఉన్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఆచరణలో ఇప్పుడు అర్హులందరికీ ఇవ్వలేదని చెప్పారు. హైదరాబాద్ చుట్టూ ప్రభుత్వ భూములు న్నాయని వివరించారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు సామాజిక అణచివేతకు గురవుతున్నారని అన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా దారి మళ్లుతున్నాయని విమర్శించారు. దళితుల సంక్షేమం, దళిత వాడల అభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల మెస్ చార్జీలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచడం లేదని అన్నారు. బీసీ కులగణన చేపట్టాలనీ, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల జనాభా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని కోరారు. సామాజిక వర్గాలకు, శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. శ్రామికుల ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. బలమైన ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు.

రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ చేయని పోరాటాలను సీపీఐ(ఎం) నిర్వహించిందని జాన్‌వెస్లీ అన్నారు. బీజేపీని సమర్థించే ఏ పార్టీ అయినా, సామాజిక సంఘ మైనా, నాయకుడైనా వ్యతిరేకిస్తామని అన్నారు. శ్రీలంకలో కమ్యూనిస్టు పార్టీకి గత ఎన్నికల్లో మూడు శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారం లోకి వచ్చారని చెప్పారు. తాము ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగొచ్చని అన్నారు. కమ్యూనిస్టులు ఏకం కావాలని అన్నారు. అందుకోసం ఐక్య కార్యాచరణ, ఐక్య ఉద్యమాలను చేపట్టాలని కోరారు. ఎక్కడ అణచివేత, దోపిడీ, నిర్బంధం ఉంటుందో అక్కడ ప్రతిఘటన ఉంటుం దన్నారు. మావోయిస్టులను అంతమొందించినా వారి భావాలను అణచివే యలేరని అన్నారు. మరో రూపంలో పోరాటాలు ముందుకొస్తాయని చెప్పారు. అమిత్‌షా లాంటి వారు వంద మంది వచ్చినా తొక్కుకుంటూ విముక్తి పోరాటాలు జరుగుతాయని వివరించారు.

# సారథిగా సలీమా టేటే

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ లీగ్‌కు హాకీ ఇండియా(హెచ్) జట్టును ప్రకటించింది. 24మందితో కూడిన జట్టుకు సలీమా టేటే సారథ్యం వహించనుండగా.. వైస్ కెప్టెన్‌గా నవ్‌నీత్ కౌర్ ఎంపికైంది. ఫిబ్రవరి 15 నుంచి 25వరకు కళింగ హాకీ స్టేడియంలో ఎఫ్ఐహెచ్ హాకీ లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫిబ్రవరి 15న ఇంగ్లండ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ తన టైటిల్ వేటను కొనసాగించనుండగా... ఆ తర్వాత నెదర్లాండ్స్, స్పెయిన్, జర్మనీలతో తలపడనుంది. ఒక్కో జట్టుతో రెండేసిసార్లు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. స్టాండ్‌బై ఆటగాళ్లుగా బన్వారీ సోలంకి, అక్షతా అబాసో థాకలే, జ్యోతి సింంగ్, సాక్షి రాణా, అన్ను, సోనమ్ ఉన్నారు.

**జట్టు...**

**గోల్‌కీపర్లు :** సవిత, బిచ్చుదేవి ఖరిబమ్

**డిఫెండర్లు :** సుశీల, నిక్కి ప్రధాన్, ఉదిత, జ్యోతి ఇషికా, జ్యోతి

**మిడ్‌ఫీల్డర్లు :** వైష్ణవి, నేహా, మనీషా, సలీమా(కెప్టెన్), సునేలిటా, లాల్‌రెమిసిమి, బల్‌జీత్, షర్మిల

**ఫార్వర్డ్స్ :** నవ్‌నీత్ కౌర్(వైస్ కెప్టెన్), ముతాజ్, ప్రీతి, రుతుజ, బ్యూటీ, సంగీత, దీపిక, వందన.

# ఇస్రో వందో ప్రయోగం విజయవంతం..

(మొదటి పేజీ తరువాయి)

120 టన్నులని పేర్కొన్నారు. వీటిలో 433 విదేశీ ఉపగ్రహాలు ఉన్నట్టు వివరించారు. ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో మూడు చంద్రయాన్ మిషన్లు, మార్స్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య ఎల్1, ఒకే ప్రయోగంలో 104 శాటిలైట్లు, నావిగేషన్, భూ పర్యవేక్షణ ఉపగ్రహాలు ఉన్నట్టు తెలిపారు. కాగా, తాజాగా కక్ష్యలో ప్రవేశపెట్టిన ఎస్‌వీఎస్-02 ఉపగ్రహం ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. దీని బరువు 2,250 కిలోలు. ఇస్రో చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్‌కు ఇది మొదటి ప్రయోగం. వ్యవసాయంలో సాంకేతికత, విమానాల నిర్వహణ, మొబైల్ పరికరాల్లో లొకేషన్ తదితర సేవలను ఈ ఉపగ్రహం అందిస్తుంది.

# కుప్పకూలిన విమానం

**20 మంది దుర్మరణం**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సౌత్ సూడాన్‌లోజరిగిన ఘోర విమాన ప్రమాదంలో 20మంది ప్రయాణికులు మరణించారు. యూనిటీ రాష్ట్రంలో గ్రేటర్ పయనీర్ ఆపరేటింగ్ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. విధుల్లో భాగంగా స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 10.30 గంటలకు ఉద్యోగుల్ని తీసుకుని రాజధాని జుబాకు బయలుదేరింది. అయితే, రన్‌వే నుండి 500 మీటర్ల దూరంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం కూలిపోయింది. ప్రమాదంతో చమురు క్షేత్రాల సమీపంలో విమాన శకలాలు తలక్రిందులుగా పడిపోయాయి. చుట్టూ చెల్లాచెదురుగా ఉన్న విమాన శిథిలాలు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# పథకం ప్రకారమే కుల దురహంకార హత్య

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రేమ వివాహం చేసుకున్న యువకుడు కృష్ణను పథకం ప్రకారం హత్య చేసిన ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో భార్గవి ఇద్దరు సోదరులు నవీన్, వంశీ, నానమ్మ బుచ్చమ్మ, తండ్రి సైదులు ఉన్నారు. నవీన్ స్నేహితులు బైరి మహేశ్, సాయిచరణ్‌లను అరెస్ట్ చేశారు. ఆరు నెలల క్రితం వడ్లకొండ కృష్ణ, భార్గవి ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ వివాహం చేసుకున్నందుకు కక్ష పెంచుకున్న సోదరులు కృష్ణను హత్య చేశారు. సోమవారం నాడు పిల్లలమర్రి కాల్వకట్టపై మృతదేహం లభ్యమైంది. కృష్ణను చంపుతామని భార్గవి సోదరుడు నవీన్ పలుమార్లు బెదిరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. కృష్ణను హత్య చేసేందుకు భార్గవి కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరు కుట్రపన్నారు. రెండు నెలలుగా కృష్ణను హత్య చేసేందుకు పథకం వేశారు. ఈ నెల 19న హత్య చేయాలని భావించినప్పటికీ అది కుదరలేదు. దీంతో ఆదివారం హత్య చేశారు.సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్‌లోని ఓ నిందితుడి వ్యవసాయ భూమి వద్ద ఆదివారం రాత్రి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని తెల్లవారుజాము వరకు కారులో తిరిగారు. చివరకు పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాల్వకట్టపై మృతదేహాన్ని వదిలేసి నిందితులు పరారయ్యారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు.



## మల్లారెడ్డిపేటలో ఘనంగా అంజన్న జాతర

**బలగం టీవీ , గంభీరావుపేట**

మాఘమా అమావాస్య సందర్భంగా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలోని శ్రీ వీరాంజనేయస్వామి జాతరకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రతి సంవత్సరం మాఘ అమావ్యాస రోజున భీముని గుట్టపై శ్రీ వీరాంజనేయ సన్నిధిలో జాతర కొనసాగుతుంది. ఇక్కడ ఏకశిల విగ్రహ రూపంలో దర్శనమిస్తున్న శ్రీ వీరాంజనేయ స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. ఆలయం సమీపాన ఉన్న మాండవ్య నదిలో స్నానమాచరించి దర్శించుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని నమ్మకం. ఈసారి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. నాఫ్సకాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ అధికార ప్రతినిధి మృత్యుంజయం ఏఎంసీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, ఏఎంసీ వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మణిదీప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్, మాజీ సర్పంచ్ శెట్టి మహేశ్వరి రవి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, సతీష్ రెడ్డి, బాబు, చంద్రం, ప్రవీణ్ నరేందర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం..

**బలగం టీవీ, గంభీరావుపేట**

అమ్మమ్మ తాత పెద్ది రాజవ్వ వెంకయ్యల జ్ఞాపకార్థం ఒక లక్ష 11 వందల 116 రూపాయలను గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి అమెరికాలో స్థిరపడ్డ సిరినేని శ్రీధర్ నీలిమ దంపతులు ఆలయ అభివృద్ధికి విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణిదీప్ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్, ఆలయ పూజారి కమలాకర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సతీష్ రెడ్డి, మెతుకు బాబు, నరేందర్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో నిరసన

**బలగం టీవీ , బోయినిపల్లి**

కాంగ్రెస్ గ్యారంటీల గారడీలో ఆరు అబద్దాలు – అరవై ఆరు మోసాలను కొనసాగిస్తూ, ప్రజా పాలన పేరుతో నయవంచన పాలన కొనసాగిస్తూ, సంక్షేమ పథకాల అమలులో తీవ్ర వైఫల్యం చెందుతున్నదని.. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనకు నిరసనగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ అధ్యక్షతన బీజేపీ మండల శాఖ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పరశురామ్ మాట్లాడుతూ: జనవరి 26న రాత్రి 12 గంటలకు డబ్బులు వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని,కానీ ఇప్పటివరకు రూపాయి కూడా పడలేదని,రుణమాఫీ, రైతుబంధు, ఇందిరమ్మ ఇండ్లు, అన్నీ బోగస్ అని పేర్కొన్నారు.కాంగ్రెసోళ్లు మళ్లీ గ్రామ సభల పేరిట ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని,ఓట్ల కోసం వస్తే వారి హామీల అమలు విషయంపై నిలదీయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉదారి నర్సింహ చారి, అమిరిసెట్టి గంగయ్య, సుంకపాక ప్రభు, శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్, గంగాధర్ చారి, బ్రహ్మ ప్రసాద్, శరత్, రజినీకాంత్, సాయికుమార్, స్వామి, పర్సయ్య, తిరుపతి, అనిల్, వెంకటేశ్, ప్రసాద్, ధర్మేంద్ర, మధు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దొంగను పట్టుకొని చెట్టుకు కట్టేసిన స్థానికులు..

**బలగం టీవీ , వేములవాడ**

ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించిన దొంగను కాలనీ వాసులు చాకచక్యంగా పట్టుకొని చెట్టుకు కట్టేశారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వేములవడ పట్టణం గాంధీనగర్‌లో తెల్లవారుజామున దొంగతనానికి యత్నించిన నిందితుడిని పట్టుకొని కాలనీ వాసులు పోలీసులకు అప్పగించారు. చేతులకు గ్లౌజులు, ముఖంపై టవల్ వేసుకుని సీసీ కెమెరాకు చిక్కకుండా దొంగతనానికి ప్రయత్నించాడు దొంగ. సీసీ కెమెరాల ద్వారా గమనించిన స్థానికులు దొంగను పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

# 100% ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేయాలి..

**-సిబ్బంది అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయవద్దు**

**-మున్సిపల్ విధులను ప్రతి అధికారి పకడ్బందీగా నిర్వహించాలి..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

మున్సిపాలిటీలలో ప్రతి ఒక్క అధికారి తన విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సిరిసిల్ల మున్సిపాల్టీల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్సిపాలిటీ లలో పని చేస్తున్న సిబ్బంది, అధికారుల వివరాలు, వారు నిర్వహిస్తున్న విధులు, సానిటరీ డోర్ కలెక్షన్ , ఎన్ని చెత్త బుట్టలు పంపిణీ చేసారు, వాహనాలు వివరాలు, వర్కింగ్ నాన్ వర్కింగ్, ట్రెడ్ లైసెన్సు లు, వాటి ఆదాయ వివరాలు బిల్డింగ్ పెర్మిషన్స్, వి.ఎల్.టి, ఆస్తి పన్ను వసూళ్లు, స్లీపింగ్ యంత్రాలు, వాటర్ ట్యాంక్ ,డోజేర్స్, బ్లేడ్స్,వర్మి కాంపోస్ట్, ఎస్.టి.పి ప్లాంట్ పని తీరు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ మున్సిపాలిటీ సిబ్బంది కి అనుమతి లేనిదే సెలవులు మంజూరు చేయరాదని అన్నారు. సిరిసిల్ల పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా అమలు చేయాలని, ప్రతి రోజూ ఉదయం పారిశుధ్య సిబ్బంది హాజరు అటెండెన్స్ పక్కాగా నమోదు జరగాలని, ప్రతి రోజూ చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలని అన్నారు. మున్సిపల్ వాహనాలకు ప్రభుత్వ పెట్రోల్ బంక్ లో మాత్ర మే డీజిల్ వాడాలని, మున్సిపల్ వాహానాలకు జి.పి.ఎస్. ట్రాకర్ ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు ఆ వాహనాల మూవెంట్ ను మానిటరింగ్ చేయాలని అన్నారు.

మున్సిపాలిటీ లలో జారీ చేసిన ట్రెడ్ లైసెన్స్, వాటి రిన్యువల్స్, వసూలు చేస్తున్న లైసెన్స్ ఫీజు పునః పరిశీలించాలని, పూర్తి స్థాయిలో ప్రతి వ్యాపారి నుంచి ట్రెడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని, పట్టణాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు 100% ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని అన్నారు. నూతన భవన నిర్మాణాల అనుమతులు, నూతన లేఔట్ అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయాలని అన్నారు. నూతన లేఔట్ లలో ఓపెన్ ప్లేస్, ఇతర నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని అన్నారు.

పట్టణాలలో మొక్కల పెంపకం, త్రాగు నీటి సరఫరా సంబంధిత వివరాలను తెలుసుకున్నారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డు వద్ద బ్లేడ్ యంత్రాలతో మిడియన్, రొడ్డు పక్కన ఉండే పిచ్చి మొక్కల తొలగిస్తూ శుభ్రం చేయాలని సూచించారు. మున్సిపాలిటీ లలో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితి గతులు తెలుసుకున్న కలెక్టర్ ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు.

పట్టణాలలో అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలు తీసుకోవాలని, అనుమతి లేని నిర్మాణాలకు ఆస్కారం ఇవ్వవద్దని, వాటర్ బాడిస్ ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో సిరిసిల్ల మునిసిపల్ కమీషనర్ లావణ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన లింగంపేట్ ఎస్సై

**బలగం టీవీ , నిజామాబాద్**

కామారెడ్డి జిల్లా లింగంపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుధాకర్ ఏసిబి కి పట్టుబడ్డారు. నిజామాబాద్ నగరంలోని హనుమాన్ జంక్షన్ వద్ద రూ.12,500 నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇటీవలే లింగంపేట ఎస్సై స్టేషన్ బెయిల్ వ్యవహారంలో పట్టుబడగా, కొద్ది నెలల్లోనే మరో ఎస్సై ఏసీబీకి చిక్కారు. బాధితుడు చెప్పిన ప్రకారం.. . లింగం పెట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మరి కొండేష్ తన కారును నవీన్ గౌడ్ కు కొద్దిరోజుల క్రితం అమ్మారు. నవీన్ గౌడ్ నుంచి స్వామి కొనుగోలు చేశారు. నాగారంకు చెందిన చిరంజీవికి స్వామి అదే కారును అమ్మేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ లో కారుపై లోన్ వుంది. చిరంజీవి నెలవారి కిస్తులు కట్టకపోవడంతో కమ్మరి కొండేష్ పేరు పైన ఉన్న కారు ను స్వాధీన చేసుకోవడానికి ఫైనాన్స్ కంపెనీ వచ్చింది. దీనితో కొండేష్ స్థానిక లింగంపేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సుధాకర్ ఫోన్ చేసి స్వామిని లింగ పేట పోలీస్ స్టేషన్ కు పిలిపించి 6 గంటల పాటు లాకప్ లో వేశారు. కేసు నుంచి తప్పించాలంటే 20 వేల రూపాయలు ఇవ్వాలని ఎస్సై డిమాండ్ చేశారు. అంతగా ఇచ్చుకోలేని ప్రాధేయపడడంతో చివరికి రూ.12వేల 500 లకు ఒప్పంద కుదిరింది. అయితే డబ్బులు ఇవ్వాలని ఫోన్ చేయడంతో నిజామాబాద్ లో ఉన్నానని స్వామి చెప్పారు. తాను నిజామాబాద్ కి వస్తున్నానని చెప్పిన ఎస్ఐ ని పట్టించేందుకు స్వామి ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం మధ్యాహ్నం స్వామికి ఫోన్ చేసిన ఎస్ఐ సుధాకర్ హనుమాన్ జంక్షన్ వద్దకు రావాలని చెప్పాడు. దీంతో పథకం ప్రకారమే ఏసీబీతో పాటు చేరుకొని స్వామి డబ్బులు ఇచ్చాడు. వెంటనే రెడ్ హ్యాండెడ్ గా ఎస్సైనీ పట్టు కున్నారు. ఏసీబి కి పట్టుపడ్డ ఎస్సై సుధాకర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## శ్రీలంక మాజీ అధ్యక్షుని కుమారునిపై అభియోగాలు

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సే పెద్ద కుమారుడు నమల్ రాజపక్సేపై హైకోర్టులో అభియోగాలు మోపారు. 2015కి ముందు భారతదేశ పెట్టుబడిని దుర్వినియోగం చేశారని ఆయనపై ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. రగ్బీ క్రీడ అభివృద్ధి కోసం కేటాయించిన క్రిష్ హెూటల్ ప్రాజెక్టు నగదు నుండి 70 మిలియన్ల శ్రీలంక రూపాయలను దుర్వినియోగం చేశారంటూ నమల్ రాజపక్సేను 2016 జూన్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం క్రిష్ హెూటల్ ప్రాజెక్టు రద్దవడంతో ఆ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

2016 నుండి నిలిచిపోయిన క్రిష్ కేసును దిసనాయకె నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో ఇటీవల నమల్ రాజపక్సేను పోలీసులు విచారించారు. అనుమానాస్పద అస్తి కేసులో నమల్ సోదరుడు యోషితను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం యోషిత సోమవారం బెయిల్‌పై విడుదలయ్యారు.

## ఢిల్లీలో జోరుగా ఎన్నికల ప్రచారం

**బలగం టీవీ , న్యూఢిల్లీ**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ బుధవారం తన మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని హామీ ఇచ్చింది. పూర్వాంచలీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని, 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు, రూ.500 ధరకు ఎల్‌పిజి గ్యాస్ సిలెండర్ వంటి హామీలు ఇచ్చింది. రూ 25 లక్షల వరకూ ఉచిత ఆరోగ్య భీమా, ఉచిత రేషన్ కిట్లు కూడా పార్టీ హామీల్లో ఉన్నాయి. 22 ఫోకస్ ఏరియాలుగా విభజించిన ఈ మేనిఫెస్టోను ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్ విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేష్ కూడా పాల్గొన్నారు. విద్యాధికులైన నిరుద్యోగులకు నెలకు రూ 8,500 ఒక ఏడాది పాటు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. రూ.5 కే భోజనం పెట్టే ఇందిరా క్యాంటీన్లను ఢిల్లీ వ్యాప్తంగా వంద ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా జైరాం రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో కాలుష్య సమస్యను పరిష్కరించడంలో రాష్ట్రంలోని ఆప్ ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమయ్యాయని విమర్శించారు.

పాపులను ఢిల్లీ క్షమించదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. యమునా నదిలో హర్యానాలోని బిజెపి ప్రభుత్వం విషం కలుపుతోందని ఆప్ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'హర్యానా ప్రజలపై ఒక మాజీ ముఖ్యమంత్రి (కేజ్రీవాల్) దురుద్దేశపూరిత ఆరోపణలు చేస్తున్నారు. ఓటమి భయంతో ఆప్ నాయకులు నిరాశకు గురవుతున్నారు. హర్యానాకు ఢిల్లీ వేరు కాదు. ఢిల్లీలోనూ హర్యానా ప్రజలకు బంధు వులు ఉన్నారు. హర్యానా ప్రజలు తమ సొంత వ్యక్తులపై విషం కలుపుతారా?' అని కేజ్రీవాల్‌ను ఉద్దేశిస్తూ మోడీ విమర్శలు చేశారు. కర్తార్ నగర్‌లో జరిగిన బిజెపి ఎన్నికల సభలో మాట్లా డుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆప్ నాయకులను సీరియల్ కిల్లర్ చార్లెస్ శోభరాజ్‌తో పోల్చారు. 'శీష్ మహల్ నిర్మించినవాళ్లు, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వాళ్లు పేదల సంక్షేమం గురించి ఎన్నడూ ఆలోచించలేదు' అని మోడీ అన్నారు. ఈసారి బిజెపికి అవకాశం ఇవ్వాలని ఓటర్లను కోరారు.

## ధోనీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రోమో వైరల్

బలగం టీవీ, హైదరాబాద్

ఛాంపియన్స్ ట్రోఫీ దగ్గర పడుతోన్న నేపథ్యంలో మహేంద్ర సింగ్ ధోనీతో రూపొందించిన ప్రోమోను తాజాగా విడుదల చేశారు. ఇప్పుడా ప్రోమో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోలో మహీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్‌గా తానెప్పుడూ కూల్‌గానే ఉన్నానని చెప్పిన అతను.. ఇప్పుడు ఓ క్రికెట్ అభిమానిగా ఛాంపియన్స్ ట్రోఫీని కూల్ గా చూడలేనని అన్నాడు. ఎందుకంటే ఒక్క మ్యాచ్ ఓడినా కూడా అంతే సంగతులు. చాలా హాట్‌గా అనిపిస్తోంది అని పేర్కొన్నాడు. దీని కోసం డీఆర్ఎస్ (ధోనీ రిఫ్రిజిరేషన్ సిస్టమ్)ను రెడీ చేసినా అస్సలు సరిపోవట్లేదని చెప్పుకొచ్చాడు. అలా ధోనీ కామెంట్స్, విజువల్స్ తో ప్రోమో ఆద్యాంతం ఆసక్తిగా సాగింది.






## 'పరాశక్తి' టైటిల్ టీజర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

తమిళ నటుడు శివ కార్తికేయన్ మరో కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆకాశం నీ హద్దురా లాంటి సూపర్ హిట్ అందుకున్న తెలుగు దర్శకురాలు సుధా కొంగర తన తదుపరి చిత్రం శివ కార్తికేయన్‌తో చేస్తున్న విషయం తెలిసిందే. రెడ్ జెయింట్, డాన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో జయం రవి విలన్‌గా నటిస్తుండగా.. శ్రీలీల, అథర్వ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా టైటిల్ అనౌన్స్‌మెంట్ టీజర్ విడుదలైంది. ఈ సినిమాకు దివంగత నటుడు శివాజీ గణేషన్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం పరాశక్తి అనే టైటిల్‌ను పెట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నాడు.




## బ్యాచిలర్స్ ఆంథెమ్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

సందీప్ కిషన్ ప్రస్తుతం ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో మజాకా చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి బ్యాచిలర్స్ ఆంథెమ్‌ను విడుదల చేశారు. వైజాగ్ ఆర్కే బీచ్ వెంబడి సందీప్ కిషన్, రావు రమేశ్ అండ్ గ్యాంగ్ పాడుకుంటున్న ఈ పాట యూత్‌ను ఆకట్టుకునే సాగుతూ ఇంప్రెస్ చేస్తోంది. సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను లియోన్ జేమ్స్ కంపోజిషన్‌లో ధనుంజయ్ సీపాన పాడాడు. ఈ సినిమా ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ మూవీని ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# పవన్ పాడిన పాట బీటీఎస్ వచ్చేసింది..


బలగం టీవీ, హైదరాబాద్

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న చిత్రం హరిహర వీరమల్లు. ఇటీవల పవన్ కళ్యాణ్ పాడిన తొలి పాట 'మాట వినాలి'ను మేకర్స్ విడుదల చేయ గా అదిరిపోయే స్పందన వచ్చింది. తాజాగా పవన్ పాడేటప్పుడు తీసిన వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. మాట వినాలి బీటీఎస్ అం టూ ఈ వీడియోకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఇది కూడా వైరల్‌గా మారిం ది. పవన్ ఎంతో ఉత్సాహంగా, జోష్‌తో ఈ పాట పాడారు.



మొదట ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. దాదాపు సగభాగం తెరకెక్కించిన తరువాత ఆయన కొన్ని కారణాల వల్ల తప్పుకున్నారు. ఆ తరువాత జ్యోతి కృష్ణ ఈ మూవీని డైరెక్ట్ చేస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ మూవీకి సంగీతాన్ని అందిస్తున్నారు.సూర్య మూవీస్ బ్యానర్ పై ఏ ఎం రత్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. ఈ చిత్రం రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటోంది. తొలి భాగం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వైజాగ్ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాను



వైజాగ్ అంటే తనకు చాలా ఇష్టమని.. ఎంతంటే.. తాను వైజాగ్ అమ్మాయిని ప్రేమించి పెళ్లి కూడా చేసుకున్నానని నటుడు నాగచైతన్య అన్నారు. ఆయన నటించిన పాన్ ఇండియా సినిమా 'తండేల్' . చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రంలో చైతూ సరసన సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తోంది. ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమావిడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్‌ను వైజాగ్‌లోని రామా టాకీస్ రోడ్డులోని శ్రీరామ పిక్చర్ ప్యాలెస్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో లాంచ్ చేసింది.

ఈ కార్యక్రమంలో నాగ చైతన్య మాట్లాడుతూ ఏ సినిమా రిలీజ్ అయినా వైజాగ్ టాక్ ఏంటి అనేది కనుక్కుంటానని, ఇక్కడ సినిమా ఆడిందంటే ప్రపంచంలో ఎక్కడైనా ఆడాల్సిందే అని అన్నారు నాగ చైతన్య. వైజాగ్ నాకు ఎంత క్లోజ్ అంటే నేను ఇక్కడి అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా. మా ఇంట్లో రూలింగ్ వైజాగ్ వాళ్లదే. కాబట్టి మీకో రిక్వెస్ట్.. తండేల్ సినిమాకు వైజాగ్‌లో కలెక్షన్స్ షేక్ అవ్వాలి. లేదంటే ఇంట్లో నా పరువుపోతుంది (నవ్వుతూ) అన్నారు.

ఇక తండేల్ చిత్రం కోసం తామందరం తీవ్రంగా కష్టపడ్డామని చెప్పారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# టెస్టుల్లో 10 వేల పరుగుల క్లబ్‌లో స్టీవ్ స్మిత్

**ఈ మైలురాయి సాధించిన 15వ ఆటగాడు స్మిత్**

**శ్రీలంకతో జరుగుతున్న మొదటి టెస్టులో సెంచరీ చేసిన స్మిత్**

బలగం టీవీ, గాలే



అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో పది వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆ ఘనతను అందుకున్న 15వ బ్యాటర్ అయ్యాడు. దీంతో ఎలైట్ క్రికెటర్ల జాబితాలో చేరాడతను. ఇండియాతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ సమయంలో.. స్మిత్ పది వేల పరుగుల మైలురాయికి ఒక్క పరుగు దూరంలో నిలిచాడు. అయితే బుధవారం శ్రీలంకతో ప్రారంభమైన టెస్టులో ఆ మైలురాయి దాటేశాడు. టెస్టుల్లో పది వేల రన్స్ చేసిన బ్యాటర్లలో 15వ ప్లేయర్‌గా నిలిచాడతను. ఆస్ట్రేలియా తరపున నాలుగవ బ్యాటర్ అయ్యాడు. గతంలో పది వేల రన్స్ చేసిన ఆసీస్ బ్యాటర్లలో రికీ పాంటింగ్(13,378), అలన్ బోర్డర్(11,174), స్టీవ్ వా(10,927) ఉన్నారు. టెస్టుల్లో లీడింగ్ రన్ స్కోరర్‌గా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ 15,921 పరుగులతో ఉన్నారు.

ఇక మ్యాచ్ విషయానికొస్తే ఆస్ట్రేలియా బ్యాటర్లు ఉస్మాన్ కవాజా, స్మిత్‌లు సెంచరీలు బాదడంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 2 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్( 104 పరుగులు నాటౌట్), ఉస్మాన్ కవాజా (147 పరుగులు నాటౌట్) లు క్రీజులో ఉన్నారు.



# ఆస్ట్రేలియాకు శ్రీలంక షాక్..!

బలగం టీవీ, హైదరాబాద్

ఐసీసీ అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్ 2025 సూపర్ సిక్స్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు శ్రీలంక జట్టు షాకిచ్చింది. ఈ మెగా టోర్నీలో ఓటమి ఎరుగని ఆసీస్‌కు శ్రీలంక ఓటమి రుచి చూపించింది. మలేసియాలోకి బంగి వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక ఆసీస్‌పై 12 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే ఆసీస్ ఇదివరకే సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది.

మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. లంక ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు సంజన కవిండి (19), సుముదు నిసంసల (18), కెప్టెన్ మనుడి ననయక్కార (15), హిరుని హన్సిక (14) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. ఆసీస్ బౌలర్లలో లిల్లీ బాస్సింగ్‌వైట్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టింది. హస్రత్ గిల్, టెగాన్ విలియమ్సన్‌లు కూడా పొదుపుగా బౌలింగ్ చేసి చెరి రెండు వికెట్లు పడగొట్టారు.

అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. లంక బౌలర్ల దెబ్బకు ఒక్కో పరుగు చేసేందుకు నానా ఇబ్బందులు పడింది. చమోది ప్రబోద, ప్రముది మెత్సర, అసేని తలగుణే తలో రెండు వికెట్లు తీయడంతో పాటు అత్యంత పొదుపుగా బౌలింగ్ చేశారు. లిమాంస తిలకరత్న ఓ వికెట్ పడగొట్టింది. లంక బౌలర్ల ధాటికి ఆస్ట్రేలియా 20 ఓవర్లు బ్యాటింగ్ చేసి 8 వికెట్ల నష్టానికి 87 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో బే (27) టాప్ స్కోరర్‌గా నిలువగా.. మెకియోన్ (10), కెప్టెన్ హ్యామిల్టన్ (10), వికెట్ కీపర్ గ్రేస్ లయన్స్ (10) రెండంకెల స్కోర్లు చేశారు.

గ్రూప్ దశలో శ్రీలంక.. మలేసియా, వెస్టిండీస్ జట్లపై విజయాలు సాధించినప్పటికీ భారత్ చేతిలో ఘోరంగా ఓడి సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆతర్వాత సూపర్-6లో తప్పక గెలుస్తుందనుకున్న మ్యాచ్ టాస్ కూడా పడకుండానే రద్దైంది. ఈ మ్యాచ్ రద్దు కావడం శ్రీలంక సెమీస్ ఆశలను గల్లంతు చేసింది. తాజాగా శ్రీలంక ఆసీస్‌పై గెలిచినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. శ్రీలంక ఉన్న గ్రూప్-1 నుంచి భారత్, ఆస్ట్రేలియా సెమీస్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. గ్రూప్-2 నుంచి సౌతాఫ్రికా, ఇంగ్లండ్ ఫైనల్ ఫోర్‌కు చేరాయి. జనవరి 31న జరిగే తొలి సెమీఫైనల్లో భారత్, ఇంగ్లండ్ ఢీకొట్టనుండగా.. అదే రోజు జరిగే రెండ సెమీఫైనల్లో సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా అమీతుమీ తేల్చుకుంటాయి. తొలి సెమీస్ భారతకాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుండగా.. రెండో సెమీస్ మధ్యాహ్నం 12 గంటలకు మొదలవుతుంది.